తేమ నిబంధనలను సడలించాలి

» బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నెలకొన్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సీసీఐ తేమ శాతం నిబంధనలను సడలించాలని, రైతులకు కనీస మద్దతు ధరలో నిబంధనలు అమలు చేయకుండా పత్తి పంట కొనుగోళ్లు చేపట్టాలని మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. సోమవారం సీసీఐ కార్యాలయంలో సంస్థ మేనేజర్ పునీత్ రాఠిని కలిసి వినతిపత్రం అందించారు. తేమ నిబంధనలతో రైతులు ఎదుర్కుంటున్న ఇబ్బందులను ఆయిన వివరించి ఉన్నత అధికార యంత్రాంగానికి సమస్యలను తెలపాలని ఆయన ఈ సందర్భంగా కోరారు. ఈ యేడు భారీ వర్షాల వల్ల పత్తి పంటలో తేమ శాతం నిబంధనతో కనీస మద్దతు ధర దక్కడం లేదన్నారు. 8-12 శాతం నిబంధన కారణంగా ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. వెంటనే తేమ నిబంధనలను సడలించాలని డిమాండ్ చేశారు.


అర్జీదారుల సమస్యలను వింటున్న పీవో ఖుష్బుగుప్తా

గిరిజనుల దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

» గిరిజన దర్బార్‌లో పీవో ఖుష్బుగుప్తా

ఉట్నూర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రతీ సోమవారం గిరిజన దర్బార్‌లో వస్తున్న గిరిజనుల అర్జీలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని ఉట్నూర్ సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అన్నారు. సోమవారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కార్యాలయంలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో వివిధ సమస్యల పై అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు అందజేశారు. అనంతరం ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ తమకు అందిన దరఖాస్తులను సంబంధిత శాఖల సమన్వయంతో పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పరిపాలన అధికారి దామోదర స్వామి, ఇన్‌చార్జి జీసీసీ డీఎం సందీప్‌కుమార్, జేడీఎం నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇన్‌చార్జి పీవోగా బాధ్యతలు చేపట్టనున్న సబ్ కలెక్టర్

ఉట్నూర్, నవంబర్3 (ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ ఐటీడీఏ ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారిగా ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్ మంగళవారం బాధ్యతలు చేపట్టనున్నారని ఐటీడీఏ వర్గాలు తెలిపాయి. ఇక్కడ పని చేస్తున్న ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా మంగళవారం నుంచి మే మాసం వరకు మెటర్నటి సెలవులో వెళ్తున్నందున జిల్లా కలెక్టర్ రాజార్షిషా ఉట్నూర సబ్ కలెక్టర్‌కు అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో మంగళవారం బాధ్యతలు స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ పరిపాలన అధికారి దామోదర స్వామి తెలిపారు.


సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్


పత్తి కొనుగోళ్లకు.. పరిమితులు విధిస్తూ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కొర్రీలు పెట్టడంపై అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతేడు ఎకరాన 12 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసిన సీసీఐ.. ఏకంగా ఈ యేడు 5క్వింటాళ్లను తగ్గించి 7 క్వింటాళ్లను మాత్రమే కొనుగోలు చేసేందుకు నిర్ణయించడం గమనార్హం. అక్టోబరు 27 నుంచి సీసీఐ అధికారులు పూర్తి స్థాయిలో పత్తిని కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో 11 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.


● మార్కెట్లో పత్తిని కొనుగోలు చేస్తున్న అధికారులు

కొనుగోళ్లకు.. కొర్రీలు

- » ఎకరాన 7 క్వింటాళ్ల పత్తి కొనుగోలుకు సీసీఐ నిర్ణయం
- » వ్యవసాయ శాఖ అంచనాలను పరిగణలోకి తీసుకోని సీసీఐ
- » కపాస్ కిసాన్ యాప్‌తో పత్తి కొనుగోళ్లకు కొత్తగా పరిమితులు
- » సీసీఐ కఠిన నిబంధనలతో తీవ్రంగా నష్టపోతున్న రైతులు
- » పాత పద్ధతిలోనే కొనుగోలు చేయాలని రైతు సంఘాల డిమాండ్
- » ఆందోళనకు సిద్ధమవుతున్న రైతులు, ప్రతిపక్ష పార్టీల నాయకులు
- » జిల్లావ్యాప్తంగా ఈ సీజన్ 4లక్షలకు పైగా ఎకరాల్లో సాగైన పత్తి పంట

ఆదిలాబాద్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈసారి సీసీఐ కొత్తగా అమలు చేస్తున్న కపాస్ కిసాన్ యాప్ ద్వారా తలెత్తె సమస్యలను అధిగమించేందుకు మొదట జిల్లా కేంద్రంలోనే ఏ, బీ సెంటర్లలో పత్తి కొనుగోళ్లను ప్రారంభించారు. దీంతో ఇప్పటి వరకు సీసీఐ 168 మంది రైతుల నుంచి 3,584 క్వింటాళ్లు, ప్రైవేట్ వ్యాపారులు 460 మంది రైతుల నుంచి 8,646 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. దీన్ని బట్టి చూస్తుంటే రైతులకు మద్దతు ధర దక్కడం లేదని స్పష్టంగా తెలుస్తుంది. అసలే భారీ వర్షాలు, వరదలతో తీవ్రంగా నష్టపోయిన రైతులకు సీసీఐ కఠిన నిబంధనలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఇప్పటికే పత్తిని విక్రయించేందుకు స్లాట్‌ను బుక్ చేసుకున్న రైతుల పరిస్థితి గందరగోళం గా మారిది. పత్తి కొనుగోళ్లకు సీసీఐ పరిమితులు విధించడంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై సోమవారం ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతో ఫోన్‌లో మాట్లాడారు. అలాగే మాజీ మంత్రి జోగురామన్న రైతులతో కలిసి సీసీఐ జిల్లా మేనేజర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. పరిమితిని ఎత్తివేయకుంటే ఆందోళనకు సిద్ధమవుతామంటూ రైతు సంఘాల నేతలతో పాటు ప్రతిపక్ష పార్టీలు హెచ్చరికలు జారీ చేస్తున్నాయి.



సమన్వయం కరువు

వ్యవసాయ శాఖ క్రాప్‌బుకింగ్ ఆధారంగానే సీసీఐ, మార్క్‌ఫెడ్ సంస్థలు పంటలను కొనుగోలు చేస్తాయి. ఈయేడు జిల్లాలో 1,36,752 మంది రైతులు 4,25,932.15 ఎకరాల్లో పత్తి పంటను సాగు చేసినట్లు వ్య వసాయ శాఖ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. పంట లెక్కల ఆధారంగానే ఎకరాన 8 క్వింటాళ్ల పత్తి దిగుబడులు వ స్తాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఈ లెక్కన జిల్లా వ్యాప్తంగా 33లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడులు మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. కానీ సీసీఐ అధికారులు మాత్రం ఎకరాన 7 క్వింటాళ్ల పత్తి దిగుబడులను మించే అవకాశం లేదంటూ కొనుగోళ్లకు పరిమితులు విధించారు. అంటే వ్యవసాయ శాఖ, సీసీఐ అధికారుల మధ్య సమన్వయం లేకపోవడంతో రైతులు నష్టపోతున్నారు. సారవంతమైన నల్లరేగడి నేలల్లో నీటి వసతి ఉంటే ఎకరాన 10 నుంచి 12 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తాయని రైతులు పేర్కొంటున్నారు. సీసీఐ 7 క్వింటాళ్లనే కొనుగోలు చేస్తే మిగితా 5క్వింటాళ్లను రైతులు దళారులకే అమ్ముకోవాల్సిన పరిస్థితి ఉంది. దీంతో రైతులు మరింత నష్టపోయే అవకాశం ఉందని రైతు సంఘాల నేతలు పేర్కొంటున్నారు.

ఎకరాన 7క్వింటాళ్లను కొనుగోలుకు సీసీఐ నిర్ణయం

: గజానన్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి



గతేడు మాదిరిగా కాకుండా సీసీఐ ఎకరాన 7 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసేందుకు నిర్ణయించింది. గతేడు ఎకరాన 12 క్వింటాళ్లను కొనుగోలు చేశారు. ఈ సారి కపాస్ కిసాన్‌యాప్‌తో 7 క్వింటాళ్ల వరకే స్లాట్‌బుకింగ్ అవుతుంది. ఇప్పటికే ఎకరాన 12 క్వింటాళ్లను కొనుగోలు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. కానీ సీసీఐ 7 క్వింటాళ్లను మాత్రమే కొనుగోలు చేసేందుకు ముందుకు వస్తుంది. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు. ఇప్పటికే కొంత మంది రైతులు స్లాట్ బుక్ చేసుకున్నారు.

యాప్‌తో తప్పని తిప్పలు

మునుపెన్నడూ లేనివిధంగా సీసీఐ ఈ సారి కొత్తగా కపాస్ కిసాన్ యాప్‌ను అమల్లోకి తీసుకొచ్చింది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పత్తిని విక్రయించేందుకు ముందుగా స్లాట్ బుక్ చేసుకోవడం అలాగే ఎకరాన 7 క్వింటాళ్ల పరిమితిని విధించడంతో పత్తిని అమ్ముకునేందుకు అవస్థలు పడుతున్నారు. సాధారణంగా గ్రామాల్లో చాలా మంది రైతులకు స్మార్ట్‌ఫోన్లు అందుబాటులో లేవు. దీంతో స్మార్ట్‌ఫోన్

(తరువాయి 6వ పేజీలో....)


బాధ్యతలు స్వీకరిస్తున్న పుల్లారావు

ఎంపీడీవోగా పుల్లారావు బాధ్యతల స్వీకరణ

నార్నూర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): నార్నూర్ నూతన ఎంపీడీవోగా కె.పుల్లారావు సోమవారం సూపరింటెండెంట్ గంగాసింగ్ రాథోడ్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు సత్వరమే అందేలా కృషి చేస్తానన్నారు. కార్యాలయ సిబ్బంది, గ్రామస్తులు ఆయనకు అభినందనలు తెలిపారు.


గంగకు హారతులు ఇస్తున్న భక్తులు

పెన్‌గంగా తీరంలో కోటి దీపోత్సవం

భీంపూర్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని వాడూర్ పెన్‌గంగా తీరంలో సోమవారం రాత్రి కార్తీక మాసం పురస్కరించుకుని కోటి దీపోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని వివిధ గ్రామాల భక్తులు పాల్గొన్నారు. చతుర్మాస వ్రతంలో భాగంగా విశేష పూజలు నిర్వహించారు. రాత్రి భజన, కీర్తనలతో మార్మోగింది. కాగా మంగళవారం చక్ర ధనం, మహా అన్నదానం, పూజలు నిర్వహిస్తున్నట్లు గ్రామస్థులుతెలిపారు.

అలాగే, మండలంలోని తాంసి(కే) పెన్ గంగా వద్ద మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి గంగమ్మకి నైవేద్యం సమర్పించారు.

చేప విత్తనాల పంపిణీకి ఏర్పాట్లు : కలెక్టర్

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చేప విత్తనాల పంపిణీకి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపడుతున్నట్లు కలెక్టర్ రాజర్షి షా తెలిపారు. రాష్ట్ర పశుసంవర్ధక, పాడి పరిశ్రమ అభివృద్ధి, మత్స్య, క్రీడలు, యువజన సేవల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సచివాలయం నుంచి జిల్లా కలెక్టర్‌లు, మత్స్యశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో చేప విత్తనాల పంపిణీని నవంబరు నెలాఖరుకల్లా పూర్తి చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. జిల్లా మత్స్యశాఖ అధికారులతో సమన్వయం చేసుకొని, స్థానిక ప్రజాప్రతినిధులు, సీడ్ స్టాకింగ్ కమిటీతో కలిసి విత్తనాల పరిమాణం, నాణ్యతను పరిశీలించి పంపిణీ చేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, జిల్లా మత్స్యశాఖ అధికారి భాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


లక్కీ డ్రాలో టోకెన్ నెం. చూపుతున్న కలెక్టర్ రాజర్షి షా

ముగిసిన మద్యం దుకాణాల లక్కీడ్రా..

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్): జిల్లాలో మిగిలిన మద్యం దుకాణాల కేటాయింపునకు లక్కీ డ్రా సోమవారం జడ్పీ సమావేశ మందిరంలో కలెక్టర్ రాజర్షి షా ఆధ్వర్యంలో నిర్వహించారు. 2025-27 ఎక్సైజ్ పాలసీకి సంబంధించి జిల్లాలోని మొత్తం నలబై దుకాణాలకు గాను ఆరు దుకాణాలకు పది కంటే తక్కువ దరఖాస్తులు రావడంతో వాటి డ్రా ప్రక్రియను వాయిదా వేశారు. తిరిగి టెండర్లను స్వీకరించేందుకు అధికారులు తేదీలు ప్రకటించగా.. ఈసారి భారీ స్పందన లభించింది. ఆదిలాబాద్ స్టేషన్ పరిధిలోని 16, 17, 18, ఇచ్చోడ పరిధిలోని 25, 28, ఉట్నూర్ పరిధిలోని 40వ నెం. దుకాణాలకు మొత్తం 88 దరఖాస్తులు రాగా... కలెక్టర్ సమక్షంలో లక్కీ డ్రా జరిపారు. టోకెన్ నెం.లు కేటాయించి, దరఖాస్తుదారుల సమక్షంలో కలెక్టర్ స్వయంగా లక్కీ డ్రా నిర్వహించారు. లక్కీడ్రాలో అదృష్టం వరించిన వారు సంతోషం వ్యక్తం చేయగా.. మిగిలిన వారు నిరాశతో వెనుదిరిగారు. ఈ ప్రక్రియ పూర్తిగా ఫొటో, వీడియో రికార్డింగ్‌తో పారదర్శకంగా సాగిందని కలెక్టర్ తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎటువంటి అవాంతరాలు లేకుండా కొనసాగిందన్నారు. డ్రాలో ఎంపికైన వారికి లైసెన్స్ ఫీజు చెల్లింపు సదుపాయాలను వేదికపైనే కల్పించినట్లు చెప్పారు. కార్యక్రమం సజావుగా సాగేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేయగా, తగిన పోలీసు బందోబస్తు కూడా కల్పించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కే.రఘు రామ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమశ్రీ, జిల్లా అధికారులు, మద్యం దుకాణాల దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

ప్రజా వినతులపై ప్రత్యేక దృష్టి

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్): ప్రజలు అందించే వినతుల పరిష్కారానికి అధికార యంత్రాంగం సత్వర చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజావాణి ఫిర్యాదుల విభాగంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజలు నమ్మకంతో ఇచ్చే అర్జీల పట్ల నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు వాటిని పరిష్కరించాలని సూచించారు.

డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై సమీక్ష

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్): రెండు పడక గదుల ఇళ్లను ఈ నెలాఖరుకల్లా అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేసేలా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో కెఆర్కే, మావలలోని రెండు పడక గదుల ఇళ్ల కేటాయింపు, మౌలిక సదుపాయాల కల్పన, మరమ్మతుల పనులపై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేఆర్‌కే కాలనీ, మావలలో నిర్మించిన 982 ఇళ్లను నవంబర్ నెలాఖరుకల్లా లబ్దిదారులకు అందజేయాలన్నారు.

రైతు సమస్యలపై పట్టింపేదీ?

» జాగృతి జనం బాటలో ప్రభుత్వాల విధానాలపై కవిత ధ్వజం


● జిల్లాకేంద్రంలోని మార్కెట్ యార్డులో పత్తి రైతులతో మాట్లాడుతున్న కవిత

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్‌లో జాగృతి జనం బాట సోమవారం ప్రారంభమైంది. జాగృతి అధ్యక్షురాలు కవిత పట్టణంలోని మార్కెట్ యార్డును సందర్శించారు. జనం బాట కార్యక్రమంలో భాగంగా రెండు రోజుల పాటు జిల్లాలో ఆమె పర్యటించనున్న నేపథ్యంలో తొలిరోజు స్థానిక మావల వద్ద నేతలు ఘన స్వాగతం పాలికారు. పట్టణంలోని కొమురం భీం చౌరస్తాలో ఆమెకు గుస్సాడి నృత్యాలు, బతుకమ్మ పాటలతో స్వాగతం పాలికారు. కొమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించిన అనంతరం ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం వరకు పాదయాత్రగా వచ్చి ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇక్కడి నుంచి మార్కెట్ యార్డుకు చేరుకొని పత్తి కొనుగోళ్ల ప్రక్రియను పర్యవేక్షించారు. కవిత మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు దయనీయ పరిస్థితిని ఎదుర్కుంటున్నారని, తుఫాను ప్రభావంతో కురిసిన వర్షాల కారణంగా పంటలో తేమ శాతం పెరిగిందన్నారు. స్థానిక ఎంపీ, ఎమ్మెల్యే ఉన్నా సమస్య పరిష్కారం కాకపోవడం దురదృష్టకరమన్నారు.

ఆదిలాబాద్(జైనథ్): పెన్‌గంగానదిపై నిర్మిస్తున్న కోర్టా- చనకా బ్యారేజి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, నిజామాబాద్ ఎమ్మెల్సీ కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం జైనథ్ ఉమ్మడి మండలంలోని బోరజ్ పరిధిలోని కోరటా చనకా బ్యారేజి నిర్మాణం పనులను పరిశీలించి మాట్లాడారు. తర్వాత జైనథ్ లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాలో భాగంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆదిలాబాద్(మావల): మావల సమీపంలోని కొమురం భీం కాలనీని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు సోమవారం సందర్శించారు. అంతకుముందు సాంప్రదాయ డోలు వాయిద్యాలతో ఆదివాసి నాయకులు మహిళలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆదివాసీ నాయకులతో కలిసి సమావేశం అయ్యారు.

సంక్షేమ పథకాలపై శిక్షణ అధికారుల అధ్యయనం


కుమారిలో పత్తి పంట క్షేత్రాన్ని పరిశీలిస్తున్న శిక్షణ అధికారుల బృందం

నేరడిగొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు ఎంత మేరకు ప్రజలకు అందుతున్నాయనే అంశంపై శిక్షణ అధికారులు అధ్యయనం చేశారు. సోమవారం మండలంలోని కుమారి గ్రామంలో అధికారులు విస్తృతంగా పర్యటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో నిర్మించిన డంపింగ్ యార్డు, వైకుంఠధామం, పల్లె ప్రకృతి వనాలు, అంగన్‌వాడీ, పాఠశాలలను సందర్శించిన అధికారులు విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం రైతులు సాగు చేస్తున్న పంట సాగులో తీసుకుంటున్న జాగ్రత్తలు, మెళకువలతో పాటు పంట దిగుబడిని మార్కెటింగ్ చేసే విధానాన్ని రైతుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. అనంతరం పొదుపు సంఘాల మహిళలతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఎంపీడీవో, ఏపీవో, ఎంపీవో, మండలస్థాయి అధికారులు ఉన్నారు.

ఇబ్బంది కలగకుండా పంట కొనుగోలు చేయాలి

» బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన పత్తితో పాటు సోయాబీన్ మొక్కజొన్న పంటలను ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా, ఇబ్బంది పెట్టకుండా పంట కొనుగోలు చేపట్టాలని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండల కేంద్రంలో పత్తి పంట కొనుగోళను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తేమ పేరుతో ఇబ్బందులు పెట్టవద్దని కోరారు. అధిక వర్షాల వల్ల చేతికి వచ్చే మొక్కజొన్న పత్తి పంటలు తీవ్రంగా నష్టపోయారని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు ప్రారంభించి వారం రోజులు గడిచినా మొక్కజొన్న కొనుగోలు ప్రారంభం కాలేదన్నారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

'ఉట్నూర్ ఆసుపత్రిని అభివృద్ధి చేయాలి'

ఉట్నూర్, నవంబర్ 3(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రిని 200 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేసి ఏజెన్సీ ప్రాంతాల గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు బొజ్జుఆశన్న డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రలోని జిల్లా ఆసుపత్రిని ప్రజా సంఘాల నాయకులు సందర్శించారు. కార్యక్రమంలో టీఏజీఎస్ ఉట్నూర్ మండల కార్యదర్శి మడావి నాగోరావు, ఆత్రంసుందర్, అనంతరావు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లను ప్రభుత్వం కల్పించాలి

ఆదిలాబాద్(జైనథ్), నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అధికారంలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బీసీ రిజర్వేషన్‌లను కల్పించాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి బోరజ్ మండల నాయకులు ఓ.ఓమన్న అన్నారు. సోమవారం బోరజ్ రెవెన్యూ కార్యాలయం ముందు బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి పలు అంశాలతో కూడిన డిమాండ్‌లతో వినతి పత్రాన్ని బోరజ్ మండల తహసీల్దార్ రాథోడ్ రాజేశ్వరికి వినతి పత్రాన్ని అందజేశారు. బీసీ జేఏసీ నాయకులు డి.నర్సింగ్, సీహెచ్ బాపురావ్, బి.రాములు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలతో భూగర్బజలాల పెరుగుదల

బోత్, నవంబర్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిప్పల్‌ధరి గ్రామంలో సోమవారం ఎన్‌ఎస్‌ఎస్ టూ ఆధ్వర్యంలో ఆర్థిక సామాజిక సర్వేను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులకు ఇంకుడు గుంతల వల్ల కలిగే లాభాలను వివరించారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ముత్యంరెడ్డి బండారు సంతోష్ అల్లంరవి సాయికుమార్, భోజారెడ్డి, స్వామిల పాల్గొన్నారు.

నూతన కార్యవర్గానికి సత్కారం

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో స్విమ్మింగ్ క్రీడా అభివృద్ధికి తమవంతుగా కృషి చేస్తామని, క్రీడాకారులకు పూర్తి ప్రోత్సాహం అందిస్తూ వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా పాటు పడతామని జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షులు సాయిని రవికుమార్ తెలిపారు.

రైతులు పశు పోషణపై దృష్టి సారించాలి

నేరడిగొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): రైతులు అదనపు ఆదాయం కోసం పశు పోషణపై దృష్టి సారించాలని పశువైద్యాధికారి రాథోడ్ జీవన్ అన్నారు. సోమవారం మండలంలోని బుగ్గారం(బీ) గ్రామంలో సీజనల్ వ్యాధుల బారిన పడకుండా రైతులు గాలికుంటూ వ్యాధి నివారణ టీకాలు తప్పకుండా వేయించుకోవాలని కోరారు.

వార్షిక పరీక్షల కోసం విద్యార్థులను సన్నద్ధం చేయాలి

నేరడిగొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): వచ్చే వార్షిక పరీక్షల కోసం విద్యార్థులను ఇప్పటి నుంచే సన్నద్ధం చేయాలని డీఐఈఓ జాదవ్ గణేష్ కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ శబాన తరన్నమ్, మురళీ, లెక్చరర్లు పాల్గొన్నారు.

భీంపూర్ కొనుగోలు కేంద్రం ప్రారంభం

భీంపూర్ , నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): భీంపూర్‌లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారు. కొనుగోలు కేంద్రం లేక రైతులు ఇబ్బంది పడుతున్నారని గత నెల 14న పంట కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి అనే శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం వచ్చిన విషయం తెలిసిందే. దీనికి స్పందించిన జిల్లా కలెక్టర్ రాజార్షిషా, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డిలు భీంపూర్‌లో కొనుగోలు కేంద్రంకు కృషి చేశారు. అందులో భాగంగానే సోమవారం బోథ్ ఎమ్మెల్యే, డీసీసీబీ చైర్మన్‌లు నాయకులతో కలిసి కొనుగోళ్ళు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆత్మ చైర్మన్ కామన్ అశోక్, నాయకులు గడ్డం లస్మన్న, గుర్ల నరేందర్ యాదవ్, మేకల నాగయ్య పాల్గొన్నారు.

పంట మార్పిడిపై రైతులు దృష్టి సారించాలి

ఆదిలాబాద్(జైనథ్), నవంబర్ 3 (ఆంధ్రజ్యోతి): నియోజక వర్గంలోని ఆదిలాబాద్, సాత్నాల, బోరజ్, జైనథ్; బేల తదితర మండలాల రైతులు పంట మార్పిడి పై దృష్టి సారించాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. సోమవారం జైనత్; బేల మార్కెట్ కేంద్రాలలో అధికారులు నాయకులతో కలిసి సోయా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సోయా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి సోయా రైతులను శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయలశంకర్ మాట్లాడుతూ రైతులు ప్రైవేట్ వ్యాపారులకు అమ్మి నష్టపోవద్దని సూచించారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలైన సీసీఐ, మార్క్‌ఫెడ్‌లకు అమ్ముకోవాలని కోరారు. కార్యక్రమంలో జైనథ్ పీఏసీఎస్ చైర్మన్ బాలూరి గోవర్ధన్‌రెడ్డి, జైనథ్ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి అశోక్‌రెడ్డి, జైనథ్ ఆలయ కమిటీ చైర్మన్ అడ్డిరూ కేష్‌రెడ్డి, జైనథ్ సీఈఓ జి.గంగన్న, నాయకులు కట్కం రాందాస్, ముకుంద్‌రావ్, ఏనుగు రాకేష్‌రెడ్డి, లోక కరుణాకర్‌రెడ్డిలతో పాటు జైనథ్, బేల మండలాల సోయా రైతులు పాల్గొన్నారు.



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

ఐక్యత ర్యాలీని విజయవంతం చేయాలి

● ఎంపీ నగేష్ పిలుపు

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), నవంబరు 3(ఆంధ్రజ్యోతి) : దేశ ఐక్యత కోసం మాజీ హోంమంత్రి సర్దార్ వల్లభభాయ్ పటేల్ చేసిన సేవలు చిరస్మరణీయమని ఎంపీ నగేష్ తెలిపారు. సోమవారం ఎంపీ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. దేశ ఐక్యతకు సర్దార్ పటేల్ చేసిన కృషి అపారమైనదని, ఆయన దూరదృష్టి, ధైర్యసాహసాల వల్లే భారత దేశం ఏకతా బంధంతో కట్టుబడి నిలిచిందని పేర్కొన్నారు. సమావేశంలో యూత్ అధికారి శైలి బెలాల్, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రైవేట్ డిగ్రీ కళాశాలల నిరవధిక బంద్

ఆదిలాబాద్ (ఆదిలాబాద్ టౌన్), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లు విడుదల చేసేంత వరకు తమ నిరసన కొనసాగుతుందని ఆదిలాబాద్ పట్టణ ప్రైవేట్ కళాశాల యాజమాన్యాల అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. నిధుల విడుదలలో ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకోలేదని మండిపడ్డారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సోమవారం ప్రైవేట్ డిగ్రీ కళాశాలలను మూసివేయించి నిరసన తెలిపారు. ప్రభుత్వం పెండింగ్ బకాయిలు చెల్లించేంత వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

పీఆర్‌సీని వెంటనే ప్రకటించాలి

బజార్‌హత్నూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పీఆర్‌సీని ప్రకటించి వెంటనే అమలు చేయాలని బహుజన టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కాంబ్లే విజయ్ కుమార్ అన్నారు. బహుజన టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం బజార్ హత్నూర్ మండలంలోని ఆయా పాఠశాలలో ఆ సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో బహుజన టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడుగు మహేందర్, ఉపాధ్యాయులు సంఘమిత్ర, అజ్మత్, అమోల్, జీవన్, శ్రీ లక్ష్మీ, సంతోష్, నరేష్‌లున్నారు.

బీసీ రిజర్వేషన్లను ఎన్నికలలో అమలు చేయాలి

నేరడిగొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): 42 శాతం బీసీ రిజర్వేషన్లను విద్యా, ఉద్యోగ స్థానిక సంస్థల ఎన్నికలలో అమలు చేయాలని కోరుతూ సోమవారం తహసీల్దార్ కలీంకు బీసీ రిజర్వేషన్ల సాధన సమితి నాయకులు వినతిపత్రం అందజేశారు. బీసీ రిజర్వేషన్ల సాధన సమితినాయకులు జస్టిస్ వి.ఈశ్వరయ్య, టి.చిరంజీవులు, ఐఏఎస్ రిటైర్డ్, బీసీ ఎస్సీ, ఎస్టీ, జేఏసీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ విశారదన్ మహారాజ్, బి.బాలరాజ్‌గౌడ్‌ల పిలుపు మేరకు ధర్మ సమాజ్ పార్టీ నాయకులు బిల్లును 9వ షెడ్యూల్‌లో వచ్చే శీతాకాల పార్లమెంట్ సమావేశాల్లో చేర్చాలని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు

ఆదిలాబాద్(ఆదిలాబాద్ టౌన్), నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీసు ముఖ్యకార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల విభాగంలో ఎస్పీ అఖిల్ మహాజన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల వినతులను స్వీకరించి వారి సమస్యలను ఆలకించారు. సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్ ద్వారా సమస్యల పరిష్కారానికి విస్తృత సూచనలు చేశారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ప్రతి ఫిర్యాదుకు జవాబుదారి కలిగి ఉండాలని ఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో సీసీ కొండరాజు, ప్రజా ఫిర్యాదుల విభాగం అధికారిని జైస్వాల్ కవిత, వామన్ పాల్గొన్నారు.

అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇండ్లు

● మాజీ జడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి

తలమడుగు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు మాజీ జెడ్పీటిసి గోక గణేష్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రుయ్యాడీ, చాకినాపూర్, నడిమ్ పల్లె, ఆదివాసి గిరిజన గ్రామాల్లో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇందిరమ్మ ఇండ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గత పది సంవత్సరాలు పరిపాలించిన టిఆర్ఎస్ పార్టీ మండలంలో ఏ ఒక్క ఇల్లు కూడా నిర్మించి ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రెండు సంవత్సరాల్లోనే మండలంలో దాదాపు 800 ఇండ్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు మండలంలో 50 శాతం ఇండ్లు పూర్తి అయ్యాయని త్వరలోనే మిగతా పూర్తి అవడం జరుగుతుందన్నారు. ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు ప్రభుత్వం నేరుగా లబ్ధిదారును అకౌంట్ లోకి డబ్బులు అందిస్తున్నామన్నారు. ఇండ్ల మంజూరు కోసం లబ్ధిదారులు ఎవరు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. అంతేకాకుండా మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికి రేషన్ కార్డులు అందించమన్నారు.

ఇసుక పేరుతో దుర్వినియోగానికి పాల్పడితే చర్యలు

సిరికొండ, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఇసుకను దళారులు దుర్వియోగపరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సిరికొండ తహసీల్దార్ తుకారాం హెచ్చరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో పలు గ్రామాల్లో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ళకు ప్రభుత్వం తరఫున ఉచితంగా ఇసుకను అందిస్తున్నామన్నారు. ఇసుక దళారులకు అట్టి టోకెన్లను ఇచ్చి మోసపోవద్దని, ఒకవేళ ఇందిరమ్మ ఇళ్ళకు కేటాయించిన టోకెన్లను దళారులతో దుర్వినియోగపరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



పత్తిలో తేమ శాతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

కొనుగోళ్లకు.. కొర్రీలు

(5వ పేజీ తరువాయి...)

ఉన్న రైతులపై ఆధారపడి పంటను అమ్ముకునే పరిస్థితి ఏర్పడుతుంది. స్లాట్ బుకింగ్ కోసం రోజుల తరబడి ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. సోమవారం నుంచి సీసీఐ ఎకరాన 7 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసేందుకు పరిమితులు విధించడంతో ఆందోళన వ్యక్తమవుతుంది. ఇప్పటికే స్లాట్ బుక్ చేసుకున్న రైతుల పరిస్థితి ఏమిటన్నది గందరగోళంగా మారింది. అధికారులు మాత్రం తమకేమి సంబంధం లేదంటూ చేతులెత్తేయడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

పత్తి రైతులకు సీసీఐ షాక్

ఈయేడు పత్తి రైతులకు కాలం కలిసి వచ్చినట్లు కనిపించడం లేదు. ఇన్నాళ్లు భారీ వర్షాలు, వరదలు పంటలను ముంచెత్తడంతో తీవ్రంగా నష్టపోయారు. దీని నుంచి ఇప్పుడిప్పుడే బయట పడుతున్న రైతులకు సీసీఐ మరో షాక్ ఇచ్చింది. ఇప్పటికే తేమ శాతం పేరిట ధరల్లో భారీ కోతలు విధించడంతో చాలా మంది రైతులకు మద్దతు ధర దక్కడం లేదు. తాజాగా ఎకరాన 7 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసేందుకు పరిమితులు విధించడంతో రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. సీసీఐ విధిస్తున్న కఠిన నిబంధనలతో రైతులు ఆగమాగమవుతున్నారు. ఈయేడు మదద్దితు ధర రూ.8,110గా నిర్ణయించారు. మెజార్టీ రైతులకు మద్దతు ధర దక్కక పోవడంతో ప్రైవేటుకే పరుగులు తీస్తూ పంటను అమ్మేసుకుంటున్నారు. దీంతో ఒక్కో క్వింటాల్‌కు రూ. వెయ్యికి పైగా నష్టపోతున్నారు. గతేడు మాదిరిగానే ఎకరాన 12 క్వింటాళ్లను పాత పద్ధతిలోనే కొనుగోలు చేయాలని రైతులు, రైతు సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు. సీసీఐ కొనుగోళ్లపై పరిమితులను ఎత్తివేయకుంటే త్వరలోనే ఆందోళనలు చేపడతామంటూ రైతు సంఘాలు, ప్రతిపక్షాలు హెచ్చరికలు చేస్తున్నాయి.

పంటల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

నేరడిగొండ, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోయాబీన్, మొక్క జొన్న కొనుగోలు కేంద్రాలను సోమవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ప్రారంభించారు. అనంతరం రైతుల వసతులకోసం జగదాంబ జిన్నింగ్ మిల్లును పరిశీలించి దానికి అందుబాటులో తీసుకొచ్చారు. రేపటి నుంచి జగదాంబ జీన్నింగ్‌లోనే రైతుల పంటలను కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని రైతులు ప్రైవేట్ వారిని అమ్మి మోసపోకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే తమ పంటలను అమ్మాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగా రెడ్డి, ఉపాధ్యక్షులు ఆడే వసంత్ రావు. పీఏసీఎస్ చైర్మన్ సాబ్లె కిషోర్ సింగ్, మండల నాయకులు రాథోడ్ సజన్. దేవేందర్ రెడ్డి. మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేష్, పీఏసీఎస్ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

ఐక్యతగా ఉంటేనే అభివృద్ధి సాధ్యం

తలమడుగు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): అందరూ కలిసికట్టుగా ఐక్యతగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమని బోథ్‌ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్థానిక వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద దేవాదాయ శాఖ సీజీఎఫ్ నిధులతో 50 లక్షల రూపాయలతో నిర్మించిన కల్యాణ మండప ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని ప్రారంభించారు.

ప్రణాళికాబద్ధంగా బోధన చేయాలి

● స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయ స్వప్న



విద్యార్థులతో పాఠాలు బోధిస్తున్న దృశ్యం

నిర్మల్ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ప్రణాళికబద్ధంగా విద్యార్థులకు పాఠ్యాంశాల బోధన నిర్వహించాలని రత్నాపూర్ కాండ్లి స్కూల్‌కాంప్లెక్స్ హెచ్‌ఎం విజయస్వప్న పేర్కొన్నారు. సోమవారం నిర్మల్ మండలంలోని అనంతపేట ప్రాథమిక పాఠశాలను కాంప్లెక్స్ హెచ్‌ఎం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులతో కలిసి ప్రార్థనలో పాల్గొన్నారు. అనంతరం తరగతి గదులను, వంట గదిని పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ శంకర్, ఉపాధ్యాయురాలు గంగామణి, పాల్గొన్నారు.

'సీఎం వ్యాఖ్యలు సరికాదు'

కడెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల జూబ్లీహిల్స్‌లో ఎన్నికల ప్రచారంలో సీఎం రేవంత్ రెడ్డి ఆపరేషన్ సింధూర్ మీద చేసిన అనుచిత వ్యాఖ్యలు సరికాదని కడెం మండల బీజేపీ అధ్యక్షులు కాశవేణి శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో ఈమేరకు కడెం తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఇస్లావత్ మోహన్ నాయక్, సత్తన్న యాదవ్, శ్రీరామ్, ములికి కృష్ణ, తురుమలయ్య, ధర్మాజీ రమేష్, చందు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి చేయాలి

భైంసా, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ద అడెల్లి పోచమ్మ తల్లి ఆలయాభివృద్ధి అంకితభావంతో తోడ్పాటునివ్వాలని ఆ ఆలయ కమిటీ నూతన డైరెక్టర్ నారాయణరెడ్డికి ముథోల్ మాజీఎమ్మెల్యే బోస్లే నారాయణరావ్ పాటిల్ సూచించారు. సోమవారం ఆలయ కమిటీ డైరెక్టర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన లోకేశ్వరం మండల మాజీ ఎంపీపీ నారాయణరెడ్డి సాయంత్రం భైంసాలో మాజీ ఎమ్మెల్యే పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నారాయణరెడ్డిని సన్మానించి జ్ఞాపికలు బహూకరించారు. జడ్పీ మాజీ చైర్మన్ జుట్టు అశోక్, మాజీ ఎంపీపీలు పొద్దుటూరి రాంచందర్ రెడ్డి, సయ్యాజీ బోజరాం పాటిల్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

మోకు దెబ్బ జిల్లా అధ్యక్షుడిగా చేపూరి కనకాగౌడ్

కుబీర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మోకు దెబ్బ జిల్లా అధ్యక్షుడిగా కుబీర్‌కు చెందిన కనకాగౌడ్‌ను ఎంపిక చేశారు. సోమవారం భైంసాలో జరిగిన సమావేశంలో భాగంగా రాష్ట్ర అధ్యక్షు డు తెలంగాణ గౌడసంఘాల జేఏసీ రాష్ట్ర చైర్మన్ అమరవేణి నర్సాగౌడ్, రాష్ట్ర కోశాధికారి గర్గుల మురళీగౌడ్, రాష్ట్ర నాయకులు పడాల రాజేందర్‌గౌడ్, తీగల వెంకటేశ్‌గౌడ్, యాగాల దశాగౌడ్‌లు పాల్గొన్నారు.

'బిల్లు పెండింగ్‌లో పెట్టడం బాధాకరం'

నిర్మల్ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, కేంద్రానికి పంపిన బిల్లును పెండింగ్‌లో పెట్టడం బాధాకరమని బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ జిల్లా కన్వీనర్ యాటకారి సాయన్న ముదిరాజ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని అర్బన్, రూరల్ తహసీల్దార్‌కు 42 శాతం బీసీ రిజర్వేషన్ల సాధన సమితి రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్యక్రమంలో 42 శాతం రిజర్వేషన్ల సాధన సమితి సభ్యులు పాతర్ల హరీష్ ముదిరాజ్, రామగిరి రవీందర్ పాల్గొన్నారు.

కళాశాలల నిరసన



కుభీర్‌లో డిగ్రీ కళాశాలను బంద్ చేయిస్తున్న దృశ్యం

కుబీర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని తపస్వీ, వివేకానంద డిగ్రీ కళాశాలలను సోమవారం నిరవధికంగా బంద్ చేయించారు. నాలుగు సంవత్సరాలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయకుండా కళాశాలల యాజమాన్యాలతో, విద్యార్థుల భవిష్యత్తులో ప్రభుత్వం చెలగాటం ఆడుతుందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని కోరారు. లేదంటే కళాశాల అధ్యాపకులు, విద్యార్థిలోకం నిరసనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్‌లు డా. సట్ల రవి, సంధ్యారాణి, అధ్యాపకులు దత్తాత్రి, సా యన్న, రాములు, లక్ష్మణ్, శ్రీనివాస్, పోశెట్టి, ధర్మకిరణ్, శ్రీకాంత్, మౌని క, లక్ష్మీ, దత్తు, విలాస్, రాజు, విజయ్‌లున్నారు.

ముథోల్ : ముథోల్‌లోని శ్రద్ధ డిగ్రీ కళాశాల, గీర్వాణి డిగ్రీ కళాశాల యాజమాన్యాలు నిరవధిక బంద్‌ను ప్రకటించాయి. ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల అయ్యే వరకు బంద్ కొనసాగుతుందని ప్రిన్సిపాళ్లు తెలిపారు. సిబ్బందికి జీతాలు చెల్లించలేకపోవడం, బిల్డింగ్ యజమానులకు బకాయిలు చెల్లించలేకపోవడం వల్ల గత్యంతరం లేకుండా ఈ నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ప్రభుత్వం ముందుగా నాలుగు సంవత్సరాల బకాయిలను చెల్లించి, తరువాత తనిఖీలు చేయాలని ప్రిన్సిపాల్ లక్ష్మణ్ తెలిపారు.

నిర్మల్‌రూరల్ : ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలంటూ టీపీడీఎంఏ జిల్లా నాయకులు అన్నారు. జిల్లాలోని 23 ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యం ఆధ్వర్యంలో సోమవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జి. నరేష్ గౌడ్, సెక్రటరీ అఖిలేష్ సింగ్, స్టేట్ ఎగ్జిక్యూటివ్ నెంబర్ సిహెచ్. వెంకట్ రెడ్డి, ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

కుంటాల : నాలుగు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తున్నందుకు నిరసనగా సోమవార ం నుంచి కళాశాల నిరవధిక బంద్ నిర్వహిస్తున్నట్లు వాసవి కళాశాల ప్రిన్సిపల్‌లు సాయిలు, శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోమవారం కళాశాల గేటుకు తాళం వేసి నిరసన వ్యక్తం చేశారు.

వైభవంగా పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన



భక్తుల ఊరేగింపు

సారంగాపూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా సారంగాపూర్ మండలంలో మహాప్రసిద్ధి గాంచిన అడెల్లి మహాపోచమ్మ నూతన విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అడెల్లి గ్రామము నుంచి అడెల్లి మహాపోచమ్మ ఆలయం వరకు డప్పు మేళాల మధ్య భక్తి శ్రద్ధలతో మంగళహారతులతో 3కిలోమీటర్ల పాటు పాదయాత్రగా నూతన విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లారు. అడెల్లి గ్రామం నుంచి అడెల్లి మహాపోచమ్మ ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లిన నూతన విగ్రహ ఊరేగింపులో మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో వెంకన్న బ్రహ్మోత్సవాలు

ఖానాపూర్ : పట్టణంలోని పద్మావతినగర్ కాలనీలో గల శ్రీశ్రీశ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయంలో యజ్ఞము, ఆలయ బలిహరణం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం కమిటీ అధ్యక్షులు అడ్డగట్ల రాజన్న, ప్రధాన కార్యదర్శి నిమ్మల రమేష్, కోశాధికారి ఉషకోల సుధాకర్, సభ్యులు తుమ్మనపెల్లి లక్ష్మణ్, లింగాల రాము, రాంచిన్న భూమన్న, వెన్నం అంజయ్య తదితరులున్నారు.

సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం

దిలావర్‌పూర్ : మండలంలోని పురాతన కదిలి క్షేత్రంలో సోమవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం వైభవంగా నిర్వహించారు. పవిత్ర కార్తీక మాసం పురస్కరించుకొని దేవాలయం ప్రాంగణంలో కార్తీక దీపాలను వెలిగించారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ వెంకట్ రావు పటేల్, ధర్మకర్తలు అనురాధ, దత్తుపటేల్, ప్రతిభ రవి, రమేష్ పాల్గొన్నారు.

శివాలయంలో కార్తీక శోభ

నిర్మల్ రూరల్ : మండలంలోని తల్వేద గ్రామంలో గల శివాలయంలో కార్తీక మాస ఉత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం కోటివత్తులను, దీపోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని పట్టణంలోని ఓం శ్రీ గాయత్రి ఆధ్యాత్మిక జ్ఞానపీఠం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గురువు గంగాధర్ శర్మ, భద్రాచలం గురుస్వామి విశ్వేశ్వర గిరి స్వామి భక్తులకు ప్రవచనాలు చేశారు. ఈ సందర్భంగా భక్తులకు లోకల్ వెల్మల్‌కు చెందిన కరిపే చంద్రశేఖర్ జ్యోతి దంపతులు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో తల్వేద మాజీ సర్పంచ్ తోకల అనిల్, వీడీసీ సభ్యులు రాజేందర్, నవీన్, సాయన్న, నారాయణ పాల్గొన్నారు.

భూమి కబ్జా చేసిన వారిపై కేసు నమోదు చేయండి

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : సోన్ మండలం పాక్‌పట్ల గ్రామంలోని దళితుల భూమిని కబ్జా చేసి మట్టి రోడ్డు వేసిన గ్రామ వీడీసీ సభ్యుల పైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సోమవారం ప్రజావాణిలో జిల్లా అధ్యక్షుడు బత్తుల రంజిత్ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... దళితులకు అండగా నిలవాల్సిన పోలీసులు వీడీసీ ప్రలోభాలకు లొంగి బాధితులపై కేసులు వేయడం అన్యాయమన్నారు. ఇది పూర్తిగా దళితుల పక్షాన ప్రశ్నిస్తున్న నాయకుల నోరు నొక్కేయడానికి జరుగుతున్న కుట్ర అని అన్నారు. దీనిపై ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కి, మానవ హక్కుల సంఘానికి బాధితులతో కలిసి వెళ్లి ఫిర్యాదు చేస్తామని వారు తెలియజేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు కంటోల్ల వెంకట స్వామి మాట్లాడుతూ... దళిత రైతుల పట్టా భూమిని ఆక్రమించిన వీడీసీ సభ్యులపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

● జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్

భైంసా, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీసీఐ కొనుగోలు కేంద్రాలలో రైతులు పత్తిని విక్రయించే క్రమంలో కిసాన్ కపాస్ యాప్ నమోదులో ఇబ్బందులు ఏర్పకుండా వ్యవసాయ అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ సూచించారు. సోమవారం భైంసా వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఏవో, ఏఈవోలతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. వ్యవసాయ విస్తరణ అధికారులు తమ తమ క్లస్టర్ల పరిధిలోని రైతుల సెల్‌ఫోన్‌లలో కిసాన్ కపాస్ యాప్‌ను నమోదు చేసి వినియోగించే విధానాలపై అవగాహన కల్పించాలన్నారు. గత నెలలో మొంథా తుఫాను ప్రభావంతో జిల్లాలో 206 ఎకరాల్లో వివిధ రకాల పంటలు నష్టపోయినట్లుగా జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం డివిజన్ పర్యటనలకు వచ్చిన జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్ భైంసాలో వ్యవసాయ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు.

పత్తి కొనుగోలుకు స్లాట్‌బుకింగ్ తప్పనిసరి

పెంబి : కొనుగోలు ప్రక్రియలో పారదర్శకత పెంచడం కోసం కపాస్ కిసాన్ యాప్‌ను ప్రవేశపెట్టిందని ఇటిక్యాల్ వ్యవసాయ విస్తరణ అధికారి రాజ్ కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో రైతులకు కపాస్ కిసాన్ యాప్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇటిక్యాల్, గుమ్మెన, తాటిగూడ, పుల్గంపాండ్రి, రాయదారి, గ్రామాల రైతులు పాల్గొన్నారు.

దంపతులను బెదిరించి దారి దోపిడీ

నిర్మల్ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తాంసి గ్రామానికి చెందిన గోర్ల రాజేశ్వర్, భార్య సుజాతను బెదిరించి గొలుసు ఎత్తుకెళ్లారు. కుమారుడితో కలిసి తన సొంత పని నిమిత్తం సోమవారం నిర్మల్ పట్టణంకు వచ్చి తిరిగి తన గ్రామానికి మోటారు సైకిల్‌పై వెళ్తుండగా మంజులాపూర్ నుంసి తాంసీ గ్రామం మధ్య మార్గంలో రాత్రి 08:20 గంటలకు గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వచ్చి ఆపారు. బెదిరించి అతని భార్య మెడలో ఉన్న రెండున్నర తులాల బంగారు చైన్‌ను లాక్కొని వెళ్లిపోయారు. వెంటనే రూరల్ ఎస్సై లింబాద్రికి సమాచారం ఇవ్వగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణా ఆపాలి

కుంటాల, నవంబరు , 3 : (ఆంధ్రజ్యోతి) : ఇసుక అక్రమ రవాణా ఆపాలని కుంటాల మండలంలోని వెంకూర్ గ్రామానికి చెందిన పలువురు గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. భైంసా - నిర్మల్ రహదారిపై రాస్తారోకో చేశారు. ఇసుక అక్రమ రవాణాతో పర్యావరణానికి, భూగర్భ జలాలకు నష్టం వాటిల్లడంతో పాటు వ్యవసాయ భూములకు నష్టం వాటిల్లే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు ముగ్గిడి దిగంబర్, సిందే సాయినాథ్, సిందే గంగాధర్, సిందే గోవింద్ పటేల్ ఉన్నారు.

బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి...

నిర్మల్ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చినట్లు తెలంగాణ బహుజన బీడీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు చాట్ల పోశన్న తెలిపారు. వెంటనే కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు.

కొండాపూర్‌లో తాగు నీరు కలుషితం



పశువుల మలమూత్రాలతో కలుషితమైన మంచినీటి బావి

ఆదిలాబాద్(సిరికొండ)నవంబరు3(ఆంధ్రజ్యోతి): మిషన్ భగీరథ ద్వారా ప్రతీరోజూ అందించాల్సిన తాగునీరు ప్రతిరోజూ సరఫరా గాకపోవడంతో మంచినీటి బావులపైఆధారపడిన జనం కలుషితమైన నీటినితాగి అనారోగ్యాల పాలవుతున్నారు. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో తాగు నీటిని సరఫరా చేసే పైపులైన్ల నుంచి నీరు లీకేజీ అయి కలుషితంగా మారుతుంది. ఫలితంగా ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో అసలు మిషన్ భగీరథ నీరే సరాఫరా రాకపోవడంతో చేదుడు బావులపైననే ఆధారపడి జీవిస్తున్నారు. గ్రామాల్లో తాగునీరు, పరిసరాల పరిశుభ్రత, అభివృద్ధిసంక్షేమం గురించి పట్టించుకోవాల్సిన స్థానిక పంచాయతీ అధికారులు అటువైపు కన్నెత్తి కూడాచూడడం లేదన్న విమర్శలు వ్యక్తంఅవుతున్నాయి. అడపాదడపా తాగునీటిని సరఫరా చేసున్న ఓవర్ హెడ్ ట్యాంకుల్లో కనీసం ఆరు నెలలకు ఓసారైన శుభ్రం చేయడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు విన్నవించినా గ్రామపంచాయతీలకు నిధులు లేవంటూ ప్రజల సంక్షేమం గాలికి వదిలేస్తున్నారన్నారు. ఏ ఒక్క గ్రామపంచాయతీ అధికారి ప్రజలకు అందు బాటులో ఉండడం లేదని.. ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగితాల్లో మాత్రం ప్రతీ రోజూ విధులకు హాజరవుతున్నట్లు నమ్మబలుకుతున్నారని తెలిపారు.

పరిశుభ్రతను గాలికొదిలేని గ్రామాధికారులు

గ్రామాల్లో అనునిత్యం తాగునీటి సరఫరా, విద్యుత్, అభివృద్ధి, ప్రజల సంక్షేమం గురించి పట్టించుకోవాల్సిన స్థానిక పంచాయతీ అధికారులు అవేమీ పట్టించుకోకుండా ప్రజలు సంక్షేమాన్ని గాలికొదిలేశారు. మంచినీటి బావుల్లో, మురుగునీటి గుంతల్లో, కాలువల్లో, పైప్‌లైన్ లీకేజీ ఉన్న ప్రాంతాల్లో కనీసం మూడు నెలలకు ఓసారైన బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదంటే.. వారి పనితనం ఇట్టే అర్థం చేసుకోవచ్చు. రికార్డుల్లో మాత్రం ప్రతి వారానికి ఒకసారి, పదిహేను రోజులకు ఓసారి చల్లుతున్నట్లు నమోదు చేసుకుంటున్న క్షేత్రస్థాయిలో మాత్రం అందుకు విరుద్ధంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. గత 15 రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షాలతో మండలంలోని కొండాపూర్ గ్రామంలో వర్షపునీరు వచ్చి మంచినీటి బావిలో చేరుతున్నప్పటికీ అధికారులు అటువైపు కన్నెత్తి కూడా చూడడం లేదని గ్రామస్థులు ఒకింత ఆగ్రహానికి గురవుతున్నారు. ఈ కలుషితమైన నీటిని తాగి ప్రజలు జ్వరాలు, వీరేచనాలు, తదితర రోగాల బారిన పడుతున్నారన్నారు. నెలలు, సంవత్సరాలు గడుస్తున్నా ఈ సమస్య పరిష్కారం కావడం లేదని గ్రామస్థులు తెలిపారు. మంచినీటి బావిలో కలుషితమైన వర్షపు నీరు వచ్చి చేరడంతో.. కనీసం బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదని ప్రజలు వాపోతున్నారు. పలుమార్లు పంచాయతీ అధికారులకు విన్నవించినా పట్టించు కోవడం లేదని ప్రజలు తెలిపారు.



బావిలోకివచ్చి చేరుతున్న కలుషితమైన నీరు

విధులకు ఎగనామం

మండలంలోని ఏ ఒక్క గ్రామపంచాయతీ అధికారి ప్రతీరోజూ విధులకు హాజరు కావడం లేదు. ప్రజలకు ఏదైనా అత్యవసరం ఉంటే కనీసం ఫోన్‌లో అందుబాటులోకి రాకుండా.. తమకు అత్యవసర సమావేశం ఉందంటూ తప్పించుకుంటున్నారని ప్రజలు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. తమ పని వదిలిపెట్టి..మండల అభివృద్ధి కార్యాలయానికి వెళితే అక్కడ కూడా ఆ అధికారి కనిపించడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా ఉన్నతస్థాయి అధికారులు స్పందించి కలుషిత తాగునీటి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జరిగేనా?



ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బొజ్జుపటేల్(ఫైల్)

ఉట్నూర్,నవంబరు 3(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకాన్ని అటవీశాఖ అధికారులు ఆదిలోనే అడ్డుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని ఆదిమ గిరిజనులైన మన్నే, తోటి, కోలాం (పీవీటీసీ)గిరిజనులకు పక్కా ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసింది. రూ.5లక్షలతో ఒక్కొక్క ఇళ్లు నిర్మించడానికి ఉట్నూర్ మండలంలోని కోలాం గిరిజనుల కోసం 1056 ఇందిరమ్మ గృహాలు మంజూరు చేసింది. మండలంలోని ధర్మాజిపేటలో 31, కుమ్మరికుంటలో 68, సోనాపూర్‌లో 33, చెరువుగూడాలో 56, దొంగచింతలో 6, బీర్సాయిపేట కోలాంగూడాలో 36, జెండాగూడాలో 16, మొగ్రిపేట్లో 17, దంతనపల్లి నాగాపూర్‌లో 56, న్యాకులములలో 91, రాజులమడుగులో 32,శాంతాపూర్‌లో ఒకటి, కామాయిపేటలో 0, మారుతిగూడలో 13 ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసింది. ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జుపటేల్ గతవారం గ్రామాలలో పర్యటించి ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు ఇవ్వడంతోటెంకాయలు కొట్టి భూమిపూజ సైతం నిర్వహించారు.

అటవీ శాఖ అడ్డంకులు

ప్రజా ప్రతినిధులు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి భూమిపూజ నిర్వహించడంతో పాటు మంజూరు పత్రాలు ఇవ్వడం ఇంత వరకు బాగున్న గిరిజనులు ఇళ్ల నిర్మాణం పనులు ప్రారంభించే ముందు అటవి శాఖ అధికారులు గ్రామాలకు చేరుకున్నారు. కవ్వాల్‌టైగర్‌జోన్ పరిధిలోని అడవుల్లో ఈ గ్రామాలు ఉండడంతో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించడానికి అనుమతులు లేవని, గిరిజనులు ఎవరు కూడా ఇండ్లు నిర్మించొద్దని హెచ్చరించారు. అటవి శాఖ అధికారుల హెచ్చరికలతో ఆదిమ గిరిజనుల పరిస్థితి అడకత్తెరలో పోక వక్కల మారింది. దేవుడు వరమిచ్చిన కరుణించని పూజారిచందంగా తమ పరిస్థితి మారిందంటూ ఆదిమా కోలాం గిరిజనులు వాపోతున్నారు.



గిరిజనులకు పత్రాలు ఇస్తున్న ఎమ్మెల్యే బొజ్జు

ఇండ్ల నిర్మాణం అడ్డుకుంటున్నారు



ప్రభుత్వం అటవి ప్రాంతాలలో అభివృద్ధికి దూరంగా ఉన్న కోలాం గిరిజనులకు భారీ సంఖ్యలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసింది. కాని అటవి శాఖ అధికారులు అడ్డుకుంటున్నారు. ఎలాంటి అడ్డంకులు లేకుండా ఇండ్లు నిర్మించుకునేలా ప్రభుత్వం కృషి చేయాలి.

- ఆత్రంముకుందరావు, పీవీటీజీ ఐక్యవేదిక రాష్ట్రకోశాధికారి

ఎంపీడీవో దృష్టికి తీసుకువెళ్లాం



కవ్వాల్‌టైగర్‌జోన్ పరిధిలోని రిజర్వు అడవుల్లో ఉన్న గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని చేపట్టవద్దని ఎంపీడీఓకు తెలిపాము. అటవీ శాఖ ఉన్నతాధికారుల అనుమతులు వచ్చే వరకు ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని గిరిజనులకు చెప్పాం.

- శీర్ల అరుణ, ఎఫ్ఆర్ఓ బీర్సాయిపేట్

జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాం



ఉట్నూర్ మండలంలో కోలాం గిరిజన గ్రామాల ప్రజలకు ప్రభుత్వం ఇండ్లు మంజూరు చేసిన అటవీశాఖ అడ్డంకులు వస్తున్నాయని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లాం. కోర్ ఏరియా ప్రాంతంలో పక్క ఇండ్లు నిర్మించవద్దని అటవీ శాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతులు పనులు ప్రారంభం అవుతాయి.

- రాంప్రసాద్, ఎంపీడీవో, ఉట్నూర్

పత్తి కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు పెట్టొద్దు

» నిర్మల్ జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



భైంసాలో పత్తి కొనుగోళ్లను ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే రామరావ్ పాటిల్

భైంసా, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): సీసీఐ అధికారులు పత్తి కొనుగోళ్ల ప్రక్రియలో రైతులకు ఇబ్బందులు కలుగనీయకుండా చూడాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. సోమవారం భైంసాలోని కాటన్ మార్కెట్ యార్డులో ఎమ్మెల్యే రామారావ్ పాటిల్, సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్ కుమార్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ సిందే ఆనంద్‌రావ్‌లతో కలిసి సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ తేమ శాతం విషయంలో కొద్ది మేర మినహాయింపులను అనుసరిస్తూ కొనుగోళ్ల ప్రక్రియను చేపట్టాలని పేర్కొన్నారు. రైతులు సైతం నాణ్యతమైన దిగుబడులను కేంద్రాలకు తీసుకరావాలని తెలిపారు. వానాకాలం ప్రారంభం నుంచి ముగింపు దశ వరకు కూడా వర్షాలు కురిసిన నేపథ్యంలో రైతన్నలు ఎన్నో వ్యయ ప్రయాసల బారిన పడ్డారని తెలిపారు. ఈ క్రమంలో దిగుబడుల విక్రయ ప్రక్రియలో తేమ శాతం, నాణ్యత పేరిటా తిరస్కరణకు అవకాశం కొనుగోళ్లు కొనసాగేలా చూడాలని వెల్లడించారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా సోయా కొనుగోళ్లను పారదర్శకమైన రీతిలో చేపడుతామన్నారు. సోయా కొనుగోళ్లకు సంబంధించి రైతులు ఆందోళన చెందవద్దన్నారు. కనీస మద్దతు ధర పొందేందుకు గాను ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

కొనుగోలు చేసేలా చర్యలు : ఎమ్మెల్యే రామారావ్ పాటిల్

ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా సోయా, వరి ధాన్యం, మొక్కజొన్న, పత్తి దిగుబడులన్నింటినీ కొనుగోలు చేసేలా చర్యలు చేపడుతామని ముథోల్ ఎమ్మెల్యే రామారావ్ పాటిల్ వెల్లడించారు. చివరి గింజ వరకు కూడా కొనుగోళ్లు జరిగేలా చూస్తామన్నారు.

● తేమ శాతాన్ని సడలించాలి... (రైతు సంఘం ప్రతినిధులు)

వ్యవసాయ రంగంలో ప్రతికూల పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో దిగుబడుల కొనుగోళ్ల ప్రక్రియలో తేమ శాతం విధానాన్ని సడలించాలని ముథోల్ నియోజకవర్గానికి చెందిన పలువురు రైతు ప్రతినిధులు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ముథోల్ ఎమ్మెల్యే రామారావ్ పాటిల్‌లకు విజ్ఞప్తి చేశారు. సోమవారం సీసీఐ కొనుగోలు కేంద్ర ప్రారంభోత్సవ కార్యక్రమంలో రైతు సంఘం ప్రతినిధులు గోపిడి ప్రేమ్‌నాథ్ రెడ్డి, యనుపోతుల మల్లేశ్వర్, ప్రొద్దుటూరి రాంచందర్‌రెడ్డిలు మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో కొనుగోలు కేంద్రాలకు అనువైన దిగుబడులు తీసుకవెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయని వెల్లడించారు. ఈ క్రమంలో తేమ శాతం విధానం లేకుండా కొనుగోళ్లు కొనసాగేలా చూడాలని కోరారు.

మండలంలో గజ్జి కుక్కల బెడద

» వాటి నివారణకు చర్యలు తీసుకోవాలి



భీంపూర్‌లో గజ్జి కుక్క

భీంపూర్,నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో గజ్జి కుక్కల బెడద రోజు రోజుకి పెరిగిపోతోంది ఏ గ్రామంలో చుసిన అవే అదర్శనమిస్తున్నాయి వీటి వల్ల మనుషులకు కూడా ప్రాణాంతక వ్యాధులు సోకే ప్రమాదం ఉందని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఈ గజ్జి కుక్కల నివారణకు చర్యలు తీసుకాల్సిన అవసరం ఉన్నప్పటికీ ఎవరు పటించుకోవటం లేదు అని ఆయా గ్రామాల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. వాటిని ఎక్కడికైనా పంపడమా లేదా వెటర్నరీ అధికారులు ఏమైనా చికిత్సలు చేసి నివారిస్తారా అని మండల ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

కుచలాపూర్‌లో పేకాటరాయుళ్ల అరెస్టు

తలమడుగు, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుచలాపూర్ గ్రామ శివారులో పేగట ఆడుతున్నారు అన్న సమాచారం రాగా తలమడుగు ఎస్ఐ రాధిక, సిబ్బంది కలిసి దాడి చేయగా ఎనిమిది మంది పేకటాడుతూ పట్టుబడరాని వారి నుండి రు. 4790 రూపాయలు దొరికాయి. వారి వద్ద నుంచి పట్టి డబ్బులు, పేకాట ముక్కలు, నాలుగు బైకులు స్వాదీన పరుచుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతుందని ఎస్ఐ పేర్కొన్నారు.

క్రైం సమాచారం

ఉపాధ్యాయుడి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

కడెం, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): కడెం ప్రాజెక్టులో రెండు రోజుల క్రితం కరీంనగర్ జిల్లా జూలపల్లి గ్రామానికి చెందిన రాజశేఖర్‌రెడ్డి(37)అనేప్ర భుత్వ ఉపాధ్యాయుడు కడెం ప్రాజెక్టులోకిదూకి ఆత్మహత్య చేసుకున్నాడు. రెండు రోజుల నుంచి గాలింపు చర్యలు చేపట్టిన మృతదేహం దొరక లేదు. సోమవారం ఉదయం 5:45కు అతని మృతదేహం బయటకు తేలింది. సం ఘటన స్థలానికి చేరుకున్న కడెంఎస్సై సాయికిరణ్ మృతదేహాన్ని ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఒకరికి జీవిత ఖైదీ



ఆత్రం మారుతి

ఆదిలాబాద్(ఆదిలాబాద్‌టౌన్)/నార్నూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):భార్యను చంపిన భర్తకుయావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లా ప్రధాన న్యాయాధికారి ప్రభాకర్ రావు తీర్పు వెలువరించారు. ఘటన జరిగిన ఎనిమిది నెలల్లో విచారణ పూర్తి చేసి నేరస్తునికి శిక్ష విధించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. వివరాల్లోకి వెళ్తే..నార్నూర్ మండలం భీంపూర్ కొలంగూడా గ్రామానికి చెందిన ఆత్రం మారుతి ఈ ఏడాది ఫిబ్రవరి నాల్గవ తేదీన తన భార్య ఆత్రం రుక్కుబాయితో గొడవ పడి... బాధితురాలిని కింద పడేసి బండ రాయితో తలపై, ఛాతి పై కొట్టి హత్యా చేశాడు. ఇదే సమయంలో బాధితురాలు కేకలు వేయడంతో చుట్టుపక్కల వాళ్లు గమనించగా.... ఘటన స్థలం నుంచి పారిపోయాడు. మృతురాలి సోదరుడు సిడాం గంగారాం ఫిర్యాదు మేరకు అప్పటి నార్నూర్ సీఐ రహీం పాషా ఫిర్యాదును స్వీకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు జరిపారు. కోర్ట్ లో చార్జ్ షీట్ దాఖలు చేయగా.. లైజన్ అధికారి ఎం. గంగాసింగ్, కోర్టు డ్యూటీ అధికారి జాదవ్ శ్రీనివాస్ 9 మంది సాక్షులను కోర్టులో హాజరు పర్చారు. పీపీ ఏప రహీం నేరాన్ని రుజువు చేయించగా జిల్లా ప్రధాన న్యాయాధికారి ప్రభాకర్ రావు ముద్దాయికి యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ.1000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. నిందితుడికి శిక్ష పడడంలో పోలీసు యంత్రాంగం చేసిన కృషిని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ప్రత్యేకంగా అభినందించారు.

పంట దిగుబడి రాక రైతు ఆత్మహత్య

తలమడుగు నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): పంట దిగుబడి రాదేమో అని మనస్థాపానికి గురై రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన తలమడుగు మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన కుమ్మరి ప్రేమేందర్ ఈ ఏడాది ఆరు ఎకరాలు వ్యవసాయ భూమిని కౌలు తీసుకుని పంట పండించారు. కాని అధిక వర్షాల వల్ల చేతికొచ్చే పంట నేల రాలిపోవడంతో ఆ రైతు మనస్థాపానికి గురై ఆదివారం మధ్యాహ్నం పురుగుల మందు తాగి పడిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు గమనించి ఆదిలాబాద్ రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రైతు ప్రేమేందర్ మరణించినట్లు మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని ఎస్సై రాధిక వెల్లడించారు.

ఫీజ్ రీయింబర్స్‌మెంట్ కోసం కళాశాలల నిరవధిక బంద్



భైంసాలో నిరసన చేపడుతున్న టీపీడీపీఎంఎ శ్రేణులు

భైంసా, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు నిరవధిక బంద్‌కు ఉపక్రమించాయి ఇందులో భాగంగానే జిల్లాలోని ప్రైవేట్ కళాశాలలన్నీ సోమవారం నుంచి మూతపడ్డాయి. ఇది వరకు పలు మార్లు సంబంధిత సమస్య పరిష్కారం కోసం గాను సమ్మె బాట పట్టిన ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం ఇచ్చిన హమీతో నిరవధిక బంద్‌ను విరమించాయి. అయితే హమీల అమలును ప్రభుత్వం విస్మరించిన నేపథ్యంలో సోమవారం నుంచి మరోమారు నిరవధిక బంద్‌కు చర్యలు చేపట్టాయి. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న 23 ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యాలు మరోమారు కళాశాలలను మూసివేసి నిరవధిక బంద్ చేపట్టాయి. ఫీజు బకాయిల చెల్లింపుల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష పార్టీలతో పాటు విద్యార్థి సంఘాలు ఉద్యమబాట పట్టేందుకు కార్యచరణ ప్రణాళిక రూపొందించుకుంటున్నాయి.

● కష్టంగా మారిన నిర్వహణ...

ఫీజు రియాంబర్స్‌మెంట్‌పైనే ఆధారపడిన యాజమాన్యాలు, ప్రైవేటు కళాశాలలు నడుపుతున్నాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఖర్చులన్నీ యాజమాన్యాలు భరించాల్సి వస్తోంది. జిల్లా వ్యాప్తంగా రూ. 10 కోట్ల మేర ఫీజు రియాంబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయి.

విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి:గంగా ప్రసాద్

పెండింగ్‌లో ఉన్న ఫీజు రియాంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలపై ఆర్థిక భారం పడుతోంది. కళాశాల బంద్‌తో విద్యాబోధన నిలిచిపోతుంది. ప్రభుత్వం వెంటనే డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలతో చర్చలు జరిపి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.

ప్రభుత్వ తీరుతో విద్యార్థులకు కష్ట,నష్టాలు:రవి బీజేపీ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ సర్కార్ అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాల తీరుతో డిగ్రీ, పీజీ కళాశాలల విద్యార్థులు కష్టనష్టాల పాలవుతున్నారు. .

ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలి:డా.కిరణ్

విద్యార్థుల ఉజ్వల భవిష్యతు, ప్రైవేట్ డిగ్రీ , పీజీ కళాశాలల యాజమాన్యాల ఆర్థిక పరిస్థితులు, నిర్వాహణ వ్యయ భారాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే ఫీజు బకాయిలను విడుదల చేయాలి. ప్రభుత్వ తీరుతో డిగ్రీ పీజీ కళాశాలల విద్యార్థులు అన్ని విధాలుగా కష్టనష్టాలను ఎదుర్కొవాల్సి వస్తోంది. ఇకనైనా కాలయాపన విధానాలకు స్వస్తి పలికి, కళ్లబొల్లి కబుర్లను కట్టిపెట్టి ఫీజు బకాయిల విడుదలకు సత్వరమే చర్యలు చేపట్టాలి. లేని పక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాజీలేని రీతిలో ఉద్యమం చేపడుతాము.

ఎయిర్ పోర్ట్‌కు గ్రీన్ సిగ్నల్

» నెరవేరనున్న చిరకాల ఆకాంక్ష

» 700ఎకరాల భూమిని సేకరించాలని ప్రభుత్వ ఆదేశాలు

ఆదిలాబాద్(ఆదిలాబాద్‌టౌన్)నవంబరు 3 (ఆంధ్రజ్యోతి):ఆదిలాబాద్ జిల్లా వాసుల చిరకాల ఆకాంక్ష అయిన ఎయిర్‌పోర్ట్‌కు గ్రీన్ సిగ్నల్ పడింది. ఇందుకు మరో 700ఎకరాలకు సేకరించాలని ప్రభుత్వం తాజాగా ఆదేశాలు జారీ చేయడంతో జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో వాయుసేనకు చెందిన అనువైన స్థలం ఇప్పటికే అందుబాటులో ఉండగా... ఈ స్థలాన్ని పరిశీలించిన ఎయిర్ పోర్ట్ అథారిటీ అఫ్ ఇండియా అధికారులు ఎయిర్ పోర్ట్ ఏర్పాటుకు అనుకూలంగా ఉన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల పలు ఎయిర్ పోర్టుల నిర్మాణాలు చేపట్టాలని చేపట్టాలని నిర్ణయం తీసుకోగా.. కేంద్రం నుంచి కూడా సానుకూల పవనాలు వీయడంతో ఎయిర్‌పోర్ట్ కల నిజమయ్యేందుకు శరవేగంగా అడుగులు పడుతున్నాయి. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఇప్పటికే వాయుసేనకు చెందిన 362 ఎకరాల భూమి అందుబాటులో ఉండగా తాజాగా మరో 700 ఎకరాలు సేకరించాలని ఏఏఐ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి వికాస్ రాజ్ సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఆదేశాలు జారీ చేశారు. తాజాగా భూసేకరణ బాధ్యతను ఓ ప్రైవేట్ కన్సల్టెన్సీకి అప్పగించడంతో ఎయిర్ పోర్ట్ స్వప్నం సాకారం కానుందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

ప్రేమించకుంటే ప్రాణం తీస్తా..

» వేధింపులతో యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్య

» భయంతో యువకుడు నదిలో పడి ఆత్మహత్య » గ్రామంలో విషాదం



అఖిల (ఫైల్) నరేష్ (ఫైల్)

లోకేశ్వరం,నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : నన్నే ప్రేమించాలని ప్రేమ పేరుతో యువకుడు వేధించడంతో యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది.యువతి చనిపోయిందని భయంతో యువకుడు సైతం గోదావరినదిలో పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలంలోని వట్టోలి గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం లోకేశ్వరం మండలం వట్టోలి గ్రామానికి చెందిన భూంపల్లి అఖిల(21) అనే యుతికి అదే గ్రామానికి చెందిన బండోల్ల నరేష్(22) అనే యువకుడు కొంతకాలంగా ప్రేమ పేరుతో వేధిస్తున్నాడు. ఈ విషయాన్ని యువతి కుటుంబ సభ్యులకు తెలుపడంతో వారి కుటుంబ సభ్యులు యువకుడిని మందలించారు. యువతి జోలికి వెళ్లని యువకుడు మళ్లీ ఇటీవల యువతిని వేధించడం మొదలు పెట్టాడు. తనను ప్రేమించకుంటే చంపేస్తానని బెదిరించాడు. దీంతో ఆదివారం సాయంత్రం యువతి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి నీల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయితే అఖిల మరణం విషయం తెలిసిన నరేష్ కూడా అదే రోజు సాయంత్రం బ్రహ్మేశ్వర్ ఆలయం వద్ద గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై మృతురాలి తల్లి భూంపల్లి నీల, నరేష్ తల్లి బండ్లో ముత్తవ్వలు వేర్వేరు ఫిర్యాదులు ఇవ్వగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై తెలిపారు.



నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నిర్మల్ రూరల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని మంగళవారం సోఫీనగర్ ఏరియాలో నూతన స్తంభాలను ఏర్పాటు చేయుటకు గాను సోఫీనగర్ రోడ్ నెం. 4, 5వ ఏరియాలలో విద్యుత్ సరఫరాలో ఉదయం 11 గంటల నుంచి 3 గంటల వరకు అంతరాయం ఉంటుందని డీఈ వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక భాగం, ఆర్టీసీ మడిగలలో ఉదయం 10 నుండి 12:30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన తెలిపారు.

సజావుగా సోయాబీన్ కొనుగోళ్లు

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోయాబీన్ కొనుగోలు ప్రక్రియ సజావుగా కొనసాగుతోందని కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులకు టోకెన్లు జారీ చేయడం ఉదయం 6 గంటల నుంచే ప్రారంభమైందని, అన్ని కొనుగోలు కేంద్రాల్లో ఎటువంటి అంతరాయం లేకుండా కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో ఏఎంసీ ముథోల్, బోరేగావ్ (ముథోల్ మండలం), బాసర ఈ మూడు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 1,400 మందికి పైగా రైతులకు టోకెన్లు జారీ చేసినట్లు తెలిపారు. మార్కెటింగ్, వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్ శాఖ సమన్వయంతో కొనుగోలు ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, క్రమబద్ధంగా టోకెన్లు పొందుతున్నారని కలెక్టర్ తెలిపారు. రైతుల సౌకర్యార్థం కొనుగోలు కేంద్రాల వద్ద తాగునీరు, నీడ వసతులు, విశ్రాంతి ఏర్పాట్లు కూడా కల్పించామని తెలిపారు.

తేల్చరు.. నాన్చుడే!

- డీసీసీ అధ్యక్ష పదవులపై వీడని పీటముడి
- అధ్యక్షులను తేల్చక అధిష్టానానికి అవస్థలు
- పెరుగుతున్న ఆశావహులు తాకిడి
- కొత్త వారికే ఛాన్స్ అంటూ పీసీసీ ప్రకటనతో తీవ్ర పోటీ



నిర్మల్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుల నియామకం విషయంలో టీపీసీసీ చేస్తున్న జాప్యంతో అధికార కాంగ్రెస్ పార్టీ నేతల్లో తీవ్ర నిరాశ వ్యక్తమవుతోంది. అదిగో పులి అన్నట్లు చేస్తున్న నాన్చివేత ధోరణి చివరకు ఎటు దారి తీస్తుందోనన్న అభిప్రాయాలు కాంగ్రెస్ పార్టీ వర్గీయుల్లో వ్యక్తమవుతున్నాయి. ఉన్న వారినే కొనసాగిస్తారా? కొత్త వారికి అవకాశం ఇస్తారా? అనే విషయంపై కూడా స్పష్టత లేకపోవడంతో డీసీసీ అధ్యక్షుల ఎంపిక వ్యవహారం ఒక ప్రహసనంగా మారింది. అయితే తాజాగా పాత వారినందరినీ తొలగించి కచ్చితంగా కొత్తవారికే అవకాశం ఇస్తామని పీసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌లు చేసిన ప్రకటన ఇప్పుడు జిల్లా కాంగ్రెస్ రాజకీయాల్లో కలకలం రేపుతోంది. అయితే కాంగ్రెస్ పార్టీ అంతర్గత వ్యవహారాల్లో చెప్పింది చేయదు అన్న నానుడి మాదిరిగానే పాత వారిని కొందరిని కొనసాగించే అవకాశం లేకపోలేదన్న అభిప్రాయం కూడా ఆ పార్టీ వర్గాల్లో ఉంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించి నాలుగు డీసీసీ అధ్యక్ష పదవులు ఉండగా.. సామాజిక వర్గాలు కూర్పును బట్టి అధ్యక్షులను ఎంపిక చేస్తారన్న అభిప్రాయాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

పెరుగుతున్న ఆశావహుల జాబితా

కొత్త అభ్యర్థులకు అవకాశం కల్పిస్తానని పీసీసీ చేసిన ప్రకటనతో ఆశావహుల జాబితా రోజురోజుకు పెరుగుతోంది. తొలుత ఒకరిద్దరు మాత్రమే పోటీలో ఉంటారని ప్రచారం జరగగా.. టీపీసీసీ చేసిన ప్రకటన పోటీ తీవ్రతను పెంచింది. గతంలో పార్టీకి చేసిన సేవలు, కనీసం ఐదు సంవత్సరాలుగా పార్టీలో కొనసాగుతున్న వారు, పార్టీ కోసం కష్టపడిన వారు, పార్టీ లాయల్టీని కలిగి ఉన్న వారు... ఇలా అర్హతలున్న వారికి మాత్రమే డీసీసీ అధ్యక్షుడిగా అవకాశం ఇస్తామని చేసిన ప్రకటన అనేక మంది ఆశావహులను తెర మీదికి తెస్తున్నాయి. చిన్నచిన్న నేతలు సైతం టీపీసీసీ ప్రకటించినట్లుగా తమకే అవకాశం దక్కుతుందన్న ఆశలను రేకెత్తిస్తున్నది. నాలుగు జిల్లాల్లోనూ ముందుగా ఆయా జిల్లాల శాసన సభ్యులు, పార్టీ సీనియర్ నేతలు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు సూచించిన వారికి మాత్రమే అవకాశం ఉంటుందని ప్రచారం జరిగింది. కానీ మారిన పొలిటికల్ సీన్ మేరకు టీపీసీసీ కసరత్తు తరువాత అధిష్టానం ఇచ్చిన అర్హతలున్న వారికి మాత్రమే అవకాశం ఇస్తారని ప్రచారం మొదలైంది. అదే జరిగితే అనూహ్య రాజకీయ పరిణామాలు చోటు చేసుకునే అవకాశం ఉందంటున్నారు.

జిల్లాలో పోటీదారులు వీరే..

నిర్మల్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవి మరోసారి సిట్టింగ్ అధ్యక్షుడు శ్రీహరిరావుకు దక్కుతుందని ఆయన వర్గీయులు బలంగా విశ్వసిస్తున్నారు. ఆయన కూడా మరోసారి దరఖాస్తు చేసుకున్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో తాను పార్టీలో చేరి జిల్లాలో పార్టీ బలోపేతం కోసం కష్టపడ్డట్లు అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లారు. ఒకవేళ పీసీసీ ప్రకటించినట్లుగానే పాత వారందరిని తొలగించి కొత్త వారికి అవకాశం ఇస్తే మాత్రం జాబితా మరింత పెరిగే అవకాశం ఉంది. మరోవైపు పార్టీ కోసం పదేళ్ల కష్టపడిన వారికి మాత్రమే అవకాశం ఇస్తే ఆ జాబితా చాలా షార్ట్ లిస్టు అవుతుంది. తాజాగా డీసీసీ అధ్యక్ష పీఠాన్ని ఆశిస్తున్న వారిలో జడ్పీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి ముందు వరుసలో ఉన్నారు. ఆయనతో పాటు గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమన్ అలీ, అల్లూరి వాణిరెడ్డి, దశరథ రాజేశ్వర్‌లుండగా ఖానాపూర్ నియోజకవర్గం నుంచి దొనికెని దయానంద్ డీసీసీ పదవి కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో ఉన్నారు. ముథోల్ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్, సీనియర్ నాయకులు ఆనంద్ రావు పటేల్, లతీఫ్, సమత సుదర్శన్‌తో పాటు మొత్తం ఈ డీసీసీ అధ్యక్ష పదవి కోసం దరఖాస్తు చేసుకోగా అధిష్టానం ఎవరికి అవకాశం ఇస్తుందో వేచి చూడాల్సిందే మరి!!

ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి

- జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 3(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమ వారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతీ దరఖాస్తులను పరిశీలించి, తక్షణమే స్పందించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలు విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు, భూ సమస్యలకు సంబంధించి దరఖాస్తులను అదనపు కలెక్టర్‌కు సమర్పించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఆర్డీవో తర్న కళ్యాణి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.





ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న అధికారులు
(ఇన్‌సెట్‌లో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్)

చెక్‌పోస్టు వద్ద పటిష్ట భద్రత నిర్వహించాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్

తానూర్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలో మహారాష్ట్ర సరిహద్దులో గల బేల్‌తరోడా అంతరాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద 24గంటల పటిష్ట గస్తీ నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులకు ఆదేశించారు. సోమవారం ఆమె చెక్‌పోస్టును ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలో అన్ని పంటల కొనుగోలు కేంద్రాల ప్రక్రియ ప్రారంభమైనందున పక్క రాష్ట్రం నుంచి పంట అమ్మేందుకు తీసుకువచ్చే అవకాశం ఉన్నందున, నిరంతరం పటిష్ట నిఘా ఉంచాలన్నారు. చెక్‌పోస్టు గుండా జిల్లాలోకి ప్రవేశించే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. వాహనాల వివరాల నమోదుకు సంబంధించి రిజిస్టార్ పరిశీలించారు. తనిఖీలో భైంసా సబ్ కలెక్టర్ అజ్మీర సంకేత్‌కుమార్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజిప్రసాద్, పౌరసరఫరాల అధికారి రాజేందర్, తహసీల్దార్ మహేంద్రనాథ్, వ్యవసాయ అధికారి మనీషా పాల్గొన్నారు.



వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

ఆరోగ్య లక్ష్యాలను సాధించాలి

నిర్మల్ రూరల్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం నుంచి వైద్యాధికారులు, మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్‌కు జూమ్ మీటింగ్ ద్వారా వివిధ ఆరోగ్య కార్యక్రమాలను సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రాజేందర్ మాట్లాడుతూ... జాతీయ ఆరోగ్య లక్ష్యాలను సాధించడానికి అందరూ అంకిత భావంతో కృషి చేయాలని కోరారు. ప్రజలకు మెరుగైన నాణ్యమైన సేవలను అందిస్తూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. తదనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వారీగా వివిధ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాల గురించి, సమీక్షించారు. కార్యక్రమంలో కార్యక్రమం నిర్వహణ అధికారులు డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ సౌమ్య, డాక్టర్ ఆశిష్ రెడ్డి, వైద్యాధికారులు, మిడ్‌లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ పాల్గొన్నారు. .



జూమ్‌మీటింగ్‌లో పాల్గొన్న
జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి రాజేందర్

బాధితుల సమస్యలు పరిష్కరించాలి : ఎస్పీ

నిర్మల్ చైన్‌గేట్, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి) : బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్‌డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఎస్పీ డా.జానకి షర్మిల అన్నారు. సోమవారం జిల్లా పోలీసు ముఖ్యకార్యాలయంలో గ్రీవెన్స్‌డే నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. వెం టనే ఫిర్యాదుదారుల సమస్యలు పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... గ్రీవెన్స్‌డేలో వచ్చిన ఫిర్యాదులు ఆన్‌లైన్‌లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారమయ్యాయో అని ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ సమర్థవంతంగా సేవలందించాలన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ జానకి షర్మిల

పత్తి కొనుగోలు ప్రారంభోత్సవంలో వివాదం

- ఫ్లెక్సీలో ఎంపీ నగేష్ ఫొటో లేదని బీజేపీ ఆందోళన

భైంసా, నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): ఇక్కడి వ్యవసాయ మార్కెట్ కమిటీ కాటన్ యార్డులో సోమవారం సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పాటు చేసిన స్వాగత, ప్రారంభోత్సవ ఫ్లెక్సీపై వివాదం తలెత్తింది. ప్రొటోకాల్‌కు అనుగుణంగా ఫ్లెక్సీలో అందరి ఫొటోలు ఏర్పాటు చేసినప్పటికీ పార్లమెంట్ సభ్యుడు జి.నగేష్ ఫొటో లేకపోవడంతో సమస్య ఏర్పడింది. సంబంధిత అంశంపై బీజేపీ ప్రతినిధులు ఆందోళనకు దిగారు. ప్రారంభోత్సవ కార్యక్రమం కొనసాగుతుండగానే బీజేపీ భైంసా పట్టణ కమిటీ అధ్యక్షుడు రావుల రాము, మాజీ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేశ్వర్, ముథోల్ మాజీ ఎంపీటీసీ దేవేళ్ల భూమేష్ తదితరులు మార్కెట్ కమిటీ చైర్మన్ సిందే ఆనంద్‌రావ్ పాటిల్‌ను నిలదీశారు. ఎంపీ ఫొటో ఎందుకు ఏర్పాటు చేయలేదంటూ వాగ్వాదానికి దిగారు. సమస్య ముదురుతుండటంతో కలెక్టర్ అభిలాష అభినవ్, ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్‌లు జోక్యం చేసుకొని బీజేపీ శ్రేణులను సముదాయించారు. ఇదే సమయంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సైతం స్పందించి పొరపాటు జరిగిందని మరోమారు ఇలా జరుగకుండా చూస్తామని వివరణ ఇవ్వడంతో వివాదం సద్దుమణిగింది.



ఏఎంసీ చైర్మన్‌తో వాగ్వాదానికి దిగిన బీజేపీ ప్రతినిధి

బాసరలో టోకెన్ల పంపిణీ



ముథోల్‌లో పరిశీలిస్తున్న డీఏవో

బాసర , నవంబరు 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోయాబీన్ కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు అధికారులు ఎట్టకేలకు చర్యలు చేపట్టారు. సోమవారం రైతులకు కొనుగోలుకు సంబంధించిన టోకెన్ల పంపిణీని ప్రారంభించారు. టోకెన్ తీసుకున్న రైతులకు వారి పంటను కొనుగోలు చేయడానికి ఆయా తేదీలను అధికారులు కేటాయించారు. మొదటి రోజు సోమవారం సుమారు 400 మంది రైతులు టోకెన్లు తీసుకున్నారు. టోకెన్ల పంపిణీ ప్రక్రియ కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ప్రతి రైతు దగ్గర ఉన్న సోయా పంటను కొనుగోలు చేస్తామని హామీఇచ్చారు. ఈ చర్యతో సోయా రైతులకు సరైన మద్దతు ధర లభించే అవకాశం ఉంది.

టోకెన్ల జారీ ప్రక్రియ పరిశీలన...

ముథోల్ : సోయా కొనుగోలు టోకెన్ల కోసం మండల కేంద్రమైన ముథోల్‌లోని సహకార సంఘం కార్యాలయానికి రైతులు రాత్రి నుంచి తరలివచ్చారు. ముథోల్, బోరేగాం గ్రామాల్లోని గోదాముల్లో రైతులు తీసుకువచ్చిన పంటకు తూకం చేయనున్నారు. గ్రామాల వారీగా టోకెన్లు జారీ చేస్తామని ఇప్పటికే అధికారులు తెలిపారు. అయితే రైతులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో కార్యాలయ ఆవరణ కిక్కిరిసిపోయింది. రైతులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు తాగునీటి వసతితో పాటు కూర్చోవడానికి కుర్చీలు, టెంటు ఏర్పాటు చేశారు. రైతులకు ఇప్పటికే తేదీల వారీగా టోకెన్లను జారీ చేశారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ సోమవారం వేకువజామున నుంచి టోకెన్లను జారీ చేశారు. ముథోల్- 1379, బోరిగాం 460 గ్రామాల రైతులకు మొత్తం 1836 టోకెన్లను జారీ చేశారు. టోకెన్ల జారీ ప్రక్రియను మార్క్‌ఫెడ్ డీఎం ప్రవీణ్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి అంజిప్రసాద్, తహసీల్దార్ శ్రీలత, ఏవో రచన పరిశీలించారు.